

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



*వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.*

*పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై 1794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.*

*భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.*

*(గతసంచికతరువాయి)*

**అతనికి** తన చిన్నతనంలో కన్నతల్లి బంగారయ్యమ్మ తినిపించిన గోరుముద్దలు గుర్తుకు వచ్చాయి. తను సరిగా తినకపోతే బలవంతంగా అన్నం ముద్దలను నోట్లో కుక్కి తినిపించిన బాల్యస్మృతులు మదిలో మెదిలాయి.

మనసంతా ఏదోలా అయిపోయింది. చిన్నతనంలో జరిగిన సంఘటనలు జ్ఞాపకాలు మదిలో ఒకసారి మెదిలాయి.

కనిపెంచిన తల్లి గుర్తుకురావడం అది మొదటిసారి కాదు. చంద్రయ్యమ్మ చూపిస్తున్న ప్రేమవల్ల చాలాసార్లు అమ్మ గుర్తుకు వచ్చింది. అమ్మతనం మనసంతా పులకింతలా వ్యాపించేది. ముఖ్యంగా అందరితో కూర్చుని తింటున్నప్పుడు ఇటువంటి ఆలోచనలు మనసులో మెదిలేవి. తీయని జ్ఞాపకాల సెగలు మనసంతా పాకేవి.

జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగానే కళ్ళలోంచి నీళ్ళు చిప్పిల్లాయి.

"కారం ఎక్కువైంది కాబోలు. నీళ్ళు తాగు బాబూ" అంటూ వెండిగ్లాసుని నోటికి అందించింది చంద్రయ్యమ్మ. పక్కన దూరంగా భోజన పదార్థాలు అందించడానికి సిద్ధంగా ఉన్న దివాణం సిబ్బంది కూడా అప్రమత్తం అయ్యారు.

కంట్లోంచి కన్నీళ్ళు కారుతుంటే నోట్లోకి మంచినీళ్ళు దిగాయి.

భారంగా భోజనాన్ని ముగించాడు.

తర్వాత చంద్రయ్యమ్మ వద్ద సెలవు తీసుకుని తన ఏకాంత మందిరం వైపు సాగిపోయాడు విజయరామరాజు. వ్యక్తిగత సహాయకులు, పరిచారికలు అతడిని అనుసరించారు.

***పరిపాలనా పాఠాలు***

విజయనగరం సంస్థానంలో చిన విజయరామరాజు పరిపాలన ప్రారంభం అయిన తర్వాత చాలా మార్పులకు శ్రీకారం జరిగింది. చిన్న వయస్సులో పరిపాలకునిగా బాధ్యతలు తీసుకోవడంతో అతనికి చాలా విషయాల్లో మొదట అవగాహన ఉండేది కాదు. కానీ రానురాను పరిపాలనలో పట్టు సాధించడానికి ప్రయత్నాలు జరిగాయి. అతనికి సహకరించడానికి రాజ్యంలో ముఖ్యులందరూ నడుం బిగించారు.

చిన విజయరామరాజుని దత్తత తీసుకున్న చంద్రయ్యమ్మ పెద్దగా చదువుకోకపోయినా అమోఘమైన తెలివితేటలు కలిగిన వ్యక్తి. రాజ్య పరిపాలనపై చాలా అవగాహన ఉంది. ఆమెకు పెళ్ళి జరిగిన కొత్తలో భర్త పెద్ద విజయరామరాజు విజయనగరంలో చేసిన పరిపాలన గురించి ప్రత్యక్షంగా చూసేది. కింది స్థాయి సిబ్బందితో ప్రవర్తించే పద్ధతులను గమనించేది. భర్త పరిపాలనా సంబంధమైన విషయాలను ఆమెతో అప్పుడప్పుడు చర్చించేవాడు. అందువల్ల చాలా విషయాలపై అవగాహన సంపాదించింది. రాజ్య పరిపాలన చేయడంలో లోటుపాట్లు గురించి బాగా అర్థం చేసుకుంది. మిత్రులుగా కనిపించి శత్రువులుగా ఎలా మారతారో ఆమెకు తెలుసు. అందుకే అనుకూల శత్రువులు ప్రతికూల మిత్రులు సంగతి, అర్థం చేసుకుని యుద్ధతంత్రాలుపై అవగాహనను పెంచుకుంది.

పెద్దవాడవుతున్న దత్తపుత్రుడు చిన విజయరామరాజుని పరిపాలనా దక్షుడిగా మారవలసిన అవసరాన్ని ఆమె గుర్తించింది. అతని నేపథ్యం గ్రామీణ ప్రాంతమైనందున ఇంకా బాల్య చేష్టలకు దూరం కాలేదని గమనించింది. దేశంలో కాలమాన పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. బ్రిటిష్ పాలకులు తమ రాజ్యాన్ని విస్తరించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. చిన్న సంస్థానాలను తమలో కలుపుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారు. భారతదేశంలో చిన్న సంస్థానాల్లో ఉన్న సామంతరాజులను రకరకాల ప్రలోభాలకు గురిచేసి వారిని పెద్ద సంస్థానాలకు శత్రువులుగా తయారుచేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చిన విజయరామరాజు దక్షత కలిగిన పరిపాలకునిగా ఉండవలసిన అవసరాన్ని ఆమె గుర్తించింది.

భోజన సమయంలో చినరాజాతో ఈ విషయాలను చెప్పింది.

"బాబూ.. దేశంలో పరిస్థితులు బాగోలేవు, బ్రిటిష్ వారిలో సామ్రాజ్యకాంక్ష ఎక్కువ అవుతోంది. రాజ్యాలను కబళించడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు."

"అవును అమ్మయ్యా నేనూ వింటున్నాను. వేగుల సమాచారాలు ఎప్పటికప్పుడు నాకు అందుతున్నాయి"

"రాజు తన రాజ్యానికే కాకుండా ప్రజలందరికి రక్షకునిగా ఉండాలి. అందుకోసం తనని తాను తీర్చిదిద్దుకోవాలి. ఆరోగ్యంగా, ధైర్యంగా, యుక్తితో పోరాటాలు చేయాలి. ఇందుకోసం సిద్ధంగా ఉండాలి. యుక్తవయస్సులోనే వీటికి శ్రీకారం చుట్టాలి"

తల్లి చంద్రయ్యమ్మ చెబుతున్న విషయాలు విజయరామరాజుకి ఒకొక్కటిగా అర్ధం అవుతున్నాయి. తన మీద ఆశలు పెట్టుకున్న తల్లిమీద ఒక్కసారిగా అభిమానం పొంగుకుని వచ్చింది. ఇంతటి మహారాజ్య భారాన్ని తన భుజస్కంధాలపై పెట్టి రక్షణ బాధ్యత అప్పగించినందుకు తల్లిపై అభిమానం పొంగుకుని వచ్చింది.

"అమ్మయ్యా. మీరు చెబుతున్న విషయాలు చూస్తుంటే నామీద ఎన్ని ఆశలు పెట్టుకున్నారో అర్ధం అయింది. మీ ఆశలను నెరవేర్చడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు ఆ మాటలు చెబుతున్నప్పుడు విజయరామరాజులో ఒకలాంటి ఆవేశం, పట్టుదల కనిపించాయి.

చంద్రయ్యమ్మ కూడా కొడుకులో అదే కాంక్షను ఆశించింది.

తర్వాత నెమ్మదిగా "చినరాజాగారూ.. మీమీద ఆశలు పెట్టుకున్నవారు నేను మాత్రమే కాదు. ఈ విజయనగర సంస్థానంలో మనల్ని నమ్ముకుని బతుకుతున్న వేలాదిమంది ప్రజలు కూడా ఉన్నారు. నాతోపాటు వారి గురించి కూడా మీరు ఆలోచన చేయాలి"

దూరంగా నిల్చుని ఉన్న దండనాయకుడు గోపాలరాజు దగ్గరికి వచ్చాడు.

సాధారణంగా రాజులు భోజనం చేస్తున్న సమయంలో ఎవరూ దగ్గర ఉండకూడదు. కానీ ఆ కుటుంబానికి దూరపు బంధువుగా కుటుంబ సభ్యునిగా ఎంతో సన్నిహితమైన వ్యక్తి గోపాలరాజు అతను విజయనగర సంస్థానంలో రక్షణ వ్యవహారాలు ఇతర సైనిక విషయాలను పర్యవేక్షిస్తుంటాడు.

గోపాలరాజు దగ్గరకు వస్తుండటం చూసి "ఏం?" అంటూ సందేహం వచ్చే విధంగా చూశాడు చినవిజయరామరాజు.

"ఇంతవరకు అమ్మగారు చెప్పిన విషయాలు మంచిగా ఉన్నాయి. వాటి గురించి తమరు ఆలోచించాలి." సలహా ఇచ్చిన మాదిరిగా చెప్పాడు గోపాలరాజు.

"అయితే నేను ఏం చేయాలి?"

"తమరు ఈ పెద్ద రాజ్యానికి అధిపతి. విజయనగర సంస్థానం అటు గంజాం సరిహద్దు నుంచి ఇటు తుని వరకు ఎన్నో కిలోమీటర్లు విస్తరించి ఉంది. విజయనగర రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలి. కప్పాలు కట్టాలి. అందుకు అనుగుణంగా పంటలను పండించుకోవాలి. రాజ్యానికి విధేయులుగా ఉండాలి. వారి సుఖ సంతోషాలను మనం చూడాలి. మన విజయనగర సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవడానికి శత్రువులు పొంచి ఉన్నారన్న విషయం ఎప్పటికప్పుడు వేగులు సమాచారాన్ని అందిస్తున్నారు. ఈ రాజ్యాన్ని రక్షించవలసిన బాధ్యత మన మీద ఉంది. మీ పరిపాలన సజావుగా సాగాలి." గోపరాజు చెప్పాడు.

గోపాలరాజుకు ఆ కుంటుంబంతో ఎంతో చనువు ఉంది. కానీ రాజ్యాధినేతగా ఉన్న యువకుడైన చిన విజయరామరాజుతో అంత సన్నిహితత్వం లేదు. అయితే రెండురోజుల క్రితం చంద్రయ్యమ్మ అతనితో సమావేశమై కొడుకు విషయంలో తీసుకోవలసిన చర్యలను చర్చించింది. ఉడుకు రక్తంలో ఉన్న చిన విజయరామరాజు తల్లి చెప్పిన విషయాలు పూర్తిగా వింటాడన్న నమ్మకం లేక గోపాలరాజు సహాయాన్ని తీసుకుంది. అందుకనుగుణంగానే భోజన సమయంలో అతను చినరాజాకు ఈ విషయాలన్నీ ముక్తసరిగా చెప్పగలిగాడు.

చాలాసేపు విజయరామరాజు ఏమీ మాట్లాడలేదు. చెప్పిన విషయాలు అర్థం అయ్యాయి. భోజనం ముగించాడు. పక్కనున్న వ్యక్తి తాంబూలం అందించాడు. అందుకని నోట్లో వేసుకుని విశ్రాంతి తల్పంలో కూర్చున్నాడు.

చినరాజా ఏదైనా మాట్లాడాలనుకున్నా ముఖ్యమైన విషయాలు తల్లికి చెప్పాలనుకున్నా ఆ విధంగా విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పరుపులు పరిచిన తల్పంలో కూర్చుంటాడు. అది చూసి గోపాలరాజు రాజు దగ్గరికి వచ్చి నిల్చున్నాడు.

"గోపాలంబాబుగారూ.. ఇప్పుడు మనం ఏమి చేయాలి?" నెమ్మదిగా అడిగాడు విజయరామరాజు.

గోపాలరాజులో ఉత్సాహం వచ్చింది. చినరాజా మనసు ప్రశాంతంగా ఉందని సంతోషపడ్డాడు చెప్పవలసిన సమయం ఇదేనని "తమరు తక్షణం యుద్ధ విద్యలు నేర్చుకోవాలి. శత్రువు ఏ సమయంలో దాడి చేసినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఇందుకోసం అవసరమైన యుద్ధ వ్యూహాలను తెలుసుకోవాలి. తమ శిక్షణ కోసం అన్ని యుద్ధతంత్రాలు తెలిసిన ప్రత్యేకమైన శిక్షకుడ్ని రప్పించవలసిన అవసరం ఉంది. ఏమంటారు?"

"తప్పకుండా మీ ఆలోచన ప్రకారం చేయండి. మంచి కోసం అమ్మయ్య చెప్పినా మీరు చెప్పినా ఆచరించడానికి నేను సిద్ధంగానే ఉన్నాను" జవాబు కోసం చూడకుండా విజయరామరాజు లేచి నిల్చున్నాడు నెమ్మదిగా ముందుకు కదిలాడు.

***యుద్ధ తంత్రాలలో శిక్షణ***

సూర్యోదయం అయింది.

సూర్యకిరణాలు రామతీర్థం కొండలపై నుంచి పైపైకి వస్తూ అందంగా కనిపిస్తున్నాయి. విజయనగరం వీధుల్లో పుర ప్రజల హడావుడి ప్రారంభం అయింది. కోటముందునుంచి ఆవుల మందలు వెళుతున్నాయి.

చిన విజయరామరాజుకు యుద్ధ విద్యలు నేర్పించడానికి ఆ రోజు మంచి రోజుగా సిద్ధాంతులు నిర్ణయించారు. అందుకోసం కోటలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రాతఃకాలంలో అయితే నేర్పించిన విషయాలు గుర్తుంటాయని అర్థం అవుతాయని ఆ ముహూర్తాన్ని ఖరారు చేశారు.

తెల్లని అంగీతో చిన విజయరామరాజు సిద్ధమయ్యాడు.

నూనూగు మీసాలతో నూతనంగా యవ్వనంలోకి ప్రవేశిస్తున్నాడు. శరీరంలో ధృఢత్వం పెరుగుతున్నట్లుగా ఉంది. చూపులో తీక్షణత ఉంది రాజుల పౌరుషం అతనిలో తొణికిసలాడుతోంది.

సూర్యోదయం సమయం ప్రశాంతంగా ఉంది.

గోపాలరాజు, కుమందాను తదితరులంతా అక్కడకు చేరుకున్నారు.

విజయనగరంలో చిన విజయరామరాజుకి రక్షణ కోసం ఆరువందలమందితో కాల్బలగాలు ఉన్నాయి. వీరిని పర్యవేక్షించడానికి యాభై మందికి ఒకరు చొప్పున నాయకులు వారిని నియంత్రించడానికి ముగ్గురు విభాగ అధ్యక్షులు వారిపైన సైనిక సేనానులు వారిపైన దండనాయకులు ఉన్నారు. వీరంతా ప్రతిరోజూ కోటకు వచ్చి హాజరు వేయించుకోవాలి. తమ శరీర ధారుఢ్యాన్ని ఎప్పటికప్పుడు సంరక్షించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. వీరిలో కొంతమంది గ్రామాల్లోకి వెళ్ళి రైతులనుంచి కట్టవలసిన కప్పాలను ఇనాం సొమ్మును వసూలు చేసి ఖజానాకు జమ చేస్తుంటారు. ఆ విభాగాన్ని పర్యవేక్షించడానికి కొంతమంది అదనపు సిబ్బంది ఉన్నారు.

వీరిలో అత్యధికులు ఆ రోజు అక్కడికి వచ్చేశారు.

ముందుగా వారికి కర్రసాము కత్తిసాము గరిడీ తిప్పడం, ఇనుపడాలుని పట్టుకుని శత్రువు విసిరే కత్తి విసుర్లను తప్పించుకోవడం వంటి విన్యాసాలను ప్రదర్శించారు.



విజయనగరం కోట ముఖద్వారం. దీనిని బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకోవడంతో యుద్ధానికి శ్రీకారం జరిగింది. యుద్ధం 1794 లో జరిగితే, అంతకు ముందుగానే ఈ కోట నిర్మాణం జరిగిందని చారిత్రక అంశాలు తెలియచేస్తున్నాయి. ఈ కోట ఎంతో విశాలంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ కోటను వివిధరకాల విద్యాలయాలను నిర్వహించడానికి సంస్థానాధీశులు అందించారు.

కోట మధ్యలో విశాలమైన స్థలంలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. అక్కడ వాతావరణం ఎంతో గంభీరంగా ఉంది. సాధారణంగా యుద్ధం వచ్చే సమయంలో సైన్యం అంతా ముందుగా ఇటువంటి కవాతులు చేస్తారు. ఆ సమయంలో వారికి ధైర్యాన్ని నూరిపోయడంతో బాటు యుద్ధంలో శత్రువుని ఎలా తుదముట్టించవచ్చో వ్యూహాలను కూడా తెలియజేస్తారు.

ఆరోజు ఏర్పాటు చేసిన కార్యక్రమాలు, సైనిక విన్యాసాలు యుద్ధానికి సన్నద్ధ అవుతున్న వాతావరణాన్ని తలపింపజేస్తున్నాయి.

అటువంటి కార్యక్రమాలన్నీ సైన్యాధ్యక్షుడి ఆధ్వర్యంలో జరుగుతుంటాయి.

ఆ రోజు కూడా అన్ని కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

విజయరామరాజు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నాడు. అతనికి జరుగుతున్న విన్యాసాలు ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. సైన్యాధ్యక్షులు, ఇతర దండనాయకులు అక్కడ ఉన్నారు సైనికులు చేస్తున్న వివిధ రకాల విన్యాసాలను పరిశీలిస్తుంటే ఇవన్నీ తనకూ రావల్సిన అవసరం ఉందని నేర్చుకోవల్సిన ఆవశ్యకత ఉందని అనుకున్నాడు.

అదే విషయాన్ని గోపాలరాజుని పిలిచి అడిగాడు.

"యుద్ధం జరిగినప్పుడు మేము కూడా కత్తీ, డాలూ పట్టుకోవాలా?" అని

ఆ మాటలు అతని బాల్యపు పోకడలను సూచించినట్లు గోపాలరాజు గుర్తించాడు

విజయరామరాజు మాటలకు సమాధానం చెప్పకుండా "ఈరోజు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడానికి కారణం మీకు అన్ని రకాల విద్యలను నేర్పించాలని కాదు. యుద్ధ విద్యలు ఏ విధంగా ఉంటాయో తెలుసుకుంటారని రప్పించాం. సైనికులు యుద్ధం చేస్తారు. మీరు చేయిస్తారు. అంతేకానీ మీరు కత్తిపట్టుకుని యుద్ధరంగంలో దిగనవసరంలేదు. కానీ యుద్ధం ఎలా జరుగుతుందో తెలుసుకోవలసిన అవసరం తమకు ఉంటుంది. అందుకే ఈ యుద్ధ విన్యాసాలు" అన్నాడు.

ఆ తర్వాత అక్కడున్న సైనికులకు సంబంధించిన విషయాలను, వివరాలను చిన విజయరామరాజుకు వివరించారు. సైన్యం ఎంతమంది ఉన్నారో వారు చేసే విధులు ఎటువంటివో వారిని ఎవరు పర్యవేక్షిస్తుంటారో మొదలైన విషయాలను తెలియజేశారు.

విజయరామరాజు కోసం ప్రత్యేకంగా వచ్చిన వ్యక్తి దూరంగా కూర్చుని విన్యాసాలను పరిశీలిస్తున్నాడు. అతను దివాణానికి వచ్చిన తర్వాత ముందుగా విజయరామరాజుని పరిచయం చేసుకున్నాడు. తర్వాత విన్యాసాలు చూడటంలో నిమగ్నమయ్యాడు.

మధ్యాహ్న సమయం వరకు అన్ని రకాల విన్యాసాలు జరిగాయి.

తర్వాత ఆ వ్యక్తిని దివాణం సిబ్బంది విజయరామరాజు దగ్గరికి తీసుకుని వచ్చారు. అతను వినయంగా మరోసారి నమస్కారం చేశాడు. చిన్నవాడైనా విజయరామరాజు అతని వందనాన్ని స్వీకరించి దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చోమని అన్నాడు.

చాలా విషయాలు మాట్లాడిన తర్వాత ఆ వ్యక్తి "తమ సైన్యంలో ఎంతోమంది ధృఢకాయులు ఉన్నారు. యుద్ధ సమయంలో వారిని సన్నద్ధం చేయవలసిన అవసరం విజయనగరం సంస్థానంపై ఉంది" అన్నాడు.

"వారికి ఇంకా ఏమేమి అవసరం ఉంది?"

"ప్రస్తుత పరిస్థితుల్లో కత్తి యుద్ధాలు మల్లయుద్ధాలు అవసరం తగ్గుతోంది. ఫిరంగిలు వాడటంలో ఈస్టుఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్ వారు ఆరితేరి ఉన్నారు. ఆ రకమైన యుద్ధసామాగ్రిని కూడా తమరు సిద్ధం చేసుకోవాలి. వాటిని వినియోగించే నిపుణులను కూడా సైన్యంలో చేర్చుకోవాలి. తమరు కూడా అన్ని విషయాలు తెలుసుకోవాలి"

విజయరామరాజు చిన్నగా నవ్వి "అందుకే కదా తమర్ని రప్పించింది" అన్నాడు

"శిక్షణకు మీరు సిద్ధమేనా?"

విజయరామరాజు అభావంగా అతనివైపు చూస్తూ "తమకు వసతి ఏర్పాట్లు ఉన్నాయి. మీ ప్రయత్నాలు మీరు చేయండి" అంటూ కోట లోపలనున్న వసతి మందిరం వైపు సాగిపోయాడు.

ఆ వ్యక్తిని విజయరామరాజు సహాయకులు ముందుకు తీసుకుని వెళ్ళారు. ఆ రోజు విన్యాసాలకు విరామాన్ని ప్రకటించి సైనికులను శిబిరాలకు తరలించారు.

సూర్యుడు నడినెత్తిన ఉండటంతో కిరణాలు చురచురలాడుతున్నాయి.

ఆరోజు ఆనాటి కార్యకలాపాలకు విరామాన్ని ప్రకటించారు.

ఎవరి మట్టుకు వారు వెళ్ళిపోయారు

విజయరామరాజుకు దివాణంలో విశ్రాంతి మందిరంలోకి దారితీసాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments